ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక · సామాన్యుడి అస్త్రం
Your Ad Here.

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

- పెండింగ్‌లో రూ.23,120 ఫైన్లు
- అనేక ఉల్లంఘన కేసులు ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్,అక్టోబర్24 :** కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను

➤ 2వ పేజిలో..

SATURDAY 25TH OCTOBER 2025 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 204 COST : 3\- KHAMMAM, TELANGANA

శనివారం 25 అక్టోబర్ 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 204 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు

సంక్షేమశాఖ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



**హైదరాబాద్, అక్టోబర్24 :** (అక్షరం న్యూస్)

అంగన్వాడీ కేంద్రాలకు సరకుల సరఫరా నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనే, బాలామృతం, మురుకులు, బియ్యం సరఫరాపై జిల్లాల వారిగా మంత్రి సీతక్క సమీక్ష చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో

➤ మిగతా 2వ పేజిలో..

## పార్క్ స్థలానికి వీడిన చెర

### కబ్జా నుంచి కాపాడిన హైడ్రా

**హైదరాబాద్,అక్టోబర్24 :**(అక్షరం న్యూస్)

అక్రమ నిర్మాణాల కూల్చివేతలే ధ్యేయంగా హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయి. పార్కును కబ్జా చేసి.. బై నంబర్లు సృష్టించి సొంతం చేసుకునే ప్రయత్నాలకు హైడ్రా అడ్డుకట్ట వేసింది. కొండాపూర్‌లాంటి ఖరీదైన ప్రాంతంలో ఏకంగా 2000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని రాఘవేంద్ర కాలనీలో పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2 వేల గజాలను లే ఔట్‌లో చూపించారు. పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు ఆ స్థలాన్ని కబ్జా చేయడంపై దృష్టి పెట్టారు. బై నంబర్లు సృష్టించి 10 ప్లాట్లు చేసేశారు. ప్రతి ఎ÷-లాట్‌లో ఒక షెడ్డు వేశారు. దీనిపై రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి ప్రజావాణికి ఫిర్యాదు అందింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత

➤ మిగతా 2వ పేజిలో..

## ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

విక్టోరియా పార్లమెంట్ సందర్శన



**హైదరాబాద్, అక్టోబర్24 :** (అక్షరం న్యూస్)

ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెంట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా

➤ మిగతా 2వ పేజిలో..

## కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
- బతికిబయటపడ్డ 22మంది
- పలువురికి గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స



**కర్నూలు, అక్టోబర్24 :** (అక్షరం న్యూస్)

యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలుబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది. శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2-3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే

➤ మిగతా 2వ పేజిలో..

## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

- నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ది చెప్పాలి
- బాకీ కార్డు విడుదల సందర్భంగా హరీష్ విమర్శలు




**హైదరాబాద్, అక్టోబర్24 :** (అక్షరం న్యూస్)


సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారని అంటే ఘాటుగా హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ

➤ మిగతా 2వ పేజిలో..

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి
- నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు




**హైదరాబాద్, అక్టోబర్24 :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం

➤ మిగతా 2వ పేజిలో..

## పోచారంలో ప్రహరీగోడ తొలగింపు

**హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం**

**హైదరాబాద్, అక్టోబర్24** :ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు. అక్రమ ప్రహరీపై సుమారు 8 ఏళ్లుగా పోరాడిన లే అవుట్ సొసైటీ.. చివరకు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేసింది. సొసైటీ సభ్యుల ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు.దీంతో ప్రహరీ గోడను తొలగించారు హైడ్రా సిబ్బంది. 8 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రాతో పరిష్కారం లభించడంతో హైడ్రా చర్యల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.

## పాముకాటుకు గురై డిగ్రీ విద్యార్థి మృతి

**కేసు నమోదు చేసిన పోలీసులు**

పెద్దపల్లి, అక్టోబర్24 : దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన డిగ్రీ విద్యార్థిని పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో రూపు నారాయణపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థినికి శుక్రవారం పాముకాటుకు గురై మృత్యువాత పడింది. అక్షిత సుల్తానాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతోంది. దీపావళి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. శుక్రవారం కాలేజీకి పోతా అంటే తల్లి శుక్రవారం రోజు ఎందుకు వద్దు అనడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తల్లి కోమల కూలీ చేస్తేనే కుటుంబ పోషణ సాగుతుంది. దీంతో బిడ్డను ఇంటి వద్ద ఉంచి తల్లి పత్తి పంటను ఏరెందుకు కూలికి వెళ్ళింది. ఇంటి వద్ద అక్షిత కుర్చీలో కూర్చొని హోంవర్క్ చేసుకుంటుండగా పాము కాలుకు కాటు వేసింది. దీంతో వెంటనే తేరుకుని తనను ఏదో కుట్టిందని అరవడంతో ఇంటి పరిసర ప్రాంత ప్రజలు పరిగెత్తుకు వచ్చి చూడగా కుర్చీ కింద పాము ఉన్నట్లు గుర్తించారు. పామును కొడదామని లోపే అక్కడి నుంచి పారిపోయింది. విషయం తల్లికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో ఇంటికి వచ్చి అక్షితను మొదటగా తీసుకువెళ్లి అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. డిగ్రీ విద్యార్థి పాముకాటుతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. తల్లి, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ గౌడ్, కోమల దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా అక్షిత పెద్దది. ఈ మేరకు పోత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భూ కేటాయింపుల విషయంలో కొత్త పాలసీ

**రెవెన్యూశాఖలో భూ సంస్కరణలపై మంత్రుల కమిటీ చర్చ**

**సర్వీస్ ఇనామ్ భూములపై విధానాల రూపకల్పన**

**అందరికీ ఇళ్లు నిర్మించే అంశపై చర్చలు**

**వివరాలు వెల్లడించిన మంత్రులు అనగాని, పార్థసారథి**

**అమరావతి, అక్టోబర్24** : అందరికీ ఇళ్లు, రెవెన్యూశాఖలో భూ సంస్కరణలపై మంత్రుల కమిటీ చర్చించింది. సర్వీస్ ఇనాం పాలసీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన దృష్ట్యా.. భూ కేటాయింపుల విషయంలో కొత్త పాలసీపై చర్చించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు, హౌసింగ్‌పై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సమావేశమైంది. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, ఫరూక్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం వర్చువల్‌గా హాజరయ్యారు. సమావేశం అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. టిడ్కో ఇళ్ల కేటాయింపులపై జీవోఎంలో చర్చించినట్లు చెప్పారు. సర్వీస్ ఇనామ్ భూములపై విధానం రూపొందించాలని నిర్ణయించినట్లు మంత్రి అనగాని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసేందుకు దేవాదాయశాఖ అధికారులు, తహసీల్దార్లతో కమిటీ వేశామని, 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల విధానాలు సరళీకరించాలని నిర్ణయించాం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. వివిధ కంపెనీలకు భూముల కేటాయింపు విధానంపై చర్చించాం. వక్ఫ్ భూముల సంబంధిత సమస్యల పరిష్కారంపై చర్చించామని అన్నారు. 2014లో కేంద్రం 7 లక్షల టిడ్కో ఇళ్లు ఇచ్చిందని మంత్రి నారాయణ తెలిపారు. కేంద్రం ఇచ్చిన వాటిలో 5 లక్షల ఇళ్లు గ్రౌండ్ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2.61 లక్షల టిడ్కో ఇళ్లు ప్రకటించినా పూర్తి చేయలేదని, వచ్చే జూన్ నాటికి అన్ని టిడ్కో ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన వాటిలో వినియోగంలో లేని లేఅవుట్లు రద్దు చేస్తామన్నారు. 'గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు, సెంటున్నర స్థలాలు రద్దు చేస్తున్నాం. వాటికి బదులుగా 2, 3 సెంట్లు ఇవ్వాలని నిర్ణయించాం. ఇళ్లు కట్టుకోనివారు కోరితే.. స్థలం పెంచి ఇచ్చేందుకు యోచిస్తున్నాం అని పార్థసారథి తెలిపారు.గత జగన్ ప్రభుత్వం పేదలకి సెంటు భూమి ఇచ్చిందని.. కానీ అవి నివాస యోగ్యానికి పనికి రానివని మంత్రి పార్థ సారథ్గి ÷ర్ అయ్యారు. లే అవుట్లు ప్రారంభం కాని చోట వాటిని రద్దు చేసి 2, 3 సెంట్లని తమ ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. ఇంకా నిర్మాణం పూర్తి చేసుకోని చోట ఉన్నవారికి 2,3 సెంట్లు కేటాయించాలని నిర్ణయించామని వివరించారు. ఈ పక్రియని మరోసారి ముందుకు తీసుకెళ్తామని చెప్పుకొచ్చారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే విషయంపై కూడా చర్చించామని అన్నారు. ఈ విషయంలో నెలకొన్న సమస్యలని అధిగమించి ముందుకెళ్తామని మంత్రి పార్థ సారథి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. జగన్ మోహన్ రెడ్డి ఏపీ అసెంబ్లీకి రాకుండా బాలకృష్ణ గురించి మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. సహచర శాసనసభ్యుడు గురించి జగన్ ఇష్టానుసారంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని సూచించారు. బాలకృష్ణ గురించి అభ్యతరకరంగా జగన్ ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. బాలకృష్ణ బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు మంత్రి కొలుసు పార్థసారథి.

## కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

**మొదటిపేజీ తరువాయి..** సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

**మొదటిపేజీ తరువాయి..** మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఎఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు.వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## పార్క్ స్థలానికి వీడిన చెర

**మొదటిపేజీ తరువాయి..** శాఖలతో కలిసి పరిశీలించారు. పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంగా నిర్ధారించారు. రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఆ వెంటనే ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ పార్కు స్థలం విలువ దాదాపు రూ. 30 కోట్ల వరకూ ఉంటుందని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు

**మొదటిపేజీ తరువాయి..** అమలవుతున్న పథకాల ప్రగతిని మంత్రి సీతక్క సమీక్షించారు. పలు జిల్లాల్లో సరకుల సరఫరా ఆశించిన మేర లేకపోవడంపై కాంట్రాక్టర్లపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మాదిరిగా సరకుల సప్లైయర్స్ వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సరకుల సరఫరాలో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆజ్ఞాపించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకారం అందించడంలో రాజీ పడేది లేదని మందలించారు. లబ్దిదారులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేశారు. చిన్నారుల సంరక్షణ విషయంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సమయం నుంచి వారు వెళ్లే వరకు సిబ్బంది బాధ్యత వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సౌకర్యాల కల్పన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక చిన్నారి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మంత్రి సీతక్క. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా ప్రోగ్రెస్ రిపోర్టులు పంపించాలని ఆజ్ఞాపించారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షలో మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన పక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు. పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ? విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు.ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం అంటూ కొనియాడారు. ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా విక్టోరియా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

## కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

**మొదటిపేజీ తరువాయి..** ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన బస్సు 9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం అని రవాణా శాఖ పేర్కొంది.2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాన్యం ఇంక స్పందించిక పోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

## మంగినపూడి బీచ్ రోడ్డులో రోడ్డు ప్రమాదం

**మచిలీపట్నం, అక్టోబర్24 :** మంగినపూడి బీచ్ రోడ్డులో శుక్రవారంఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో- బైక్ ఢీకొని 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు మచిలీపట్నం పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.పోతేపల్లి జ్యూయలరీ పార్కు నుంచి మహిళలతో వెళ్తున్న ఆటోను కొత్తపూడి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అత్యంత వేగంతో ఢీకొట్టింది. ఆటోలో ఉన్న 11 మంది, బైక్‌పై ఉన్న ఇద్దరికీ కాళ్లు, చేతులు విరిగాయి. క్షతగాత్రులను హుటాహుటినా మచిలీపట్నంలోని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు బందరు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 19 లక్షలు

**వేములవాడ, అక్టోబర్24** రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం భారీగా వచ్చింది. 36 రోజుల హుండీ ఆదాయం రూ.2 కోట్ల 19 లక్షల 35 వేల 165రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 124 గ్రాముల బంగారం, 10 కిలోల 500 గ్రాముల వెండి వచ్చినట్టు వెల్లడించారు.ఆలయ ఓపెన్ స్లాబ్ లో పోలీసు భద్రత నడుమ అధికారులు, సిబ్బంది హుండీ ఆదాయం లెక్కించారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది తరలివస్తారు. ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. కోడె మొక్కులు చెల్లిస్తారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్?రెడ్డి 2024 నవంబర్? 20న శంకుస్థాపన చేశారు. తొలి విడతలో రూ.76 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి. అలాగే మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు రూ.42 కోట్ల నిధులతో 80 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి



**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)అక్టోబరు 24:**
రైతులు దళారుల బారిన పడి మోసపోకుండ ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశానుసారం రఘునాథపల్లి, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, లక్ష్మితండాలో ఐకేపి ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబుతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాషుమియా, పర్శ సిద్దేశ్. నాయకులు గాదె మహేందర్ రెడ్డి, లోనే శ్రావణ్ కుమార్, హయత్ ఆలీ, కడారి రవి, చిన్ననగేష్, పోకలశ్రీనివాస్,చింత హరీష్, మహమ్మద్ షబ్బీర్ మియా, వెంకటేష్, యాకుబ్, నరేష్, కాసర్ల లక్ష్మయ్య. ఐకేపీ ఏపీఎం ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని వ్యవసాయ బోరు మోటర్ సీజ్



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) అక్టోబర్ 24 అక్షరం న్యూస్:**
రామగిరి మండలం బేగంపేట్ శివారులో అనుమతి లేని వ్యవసాయ బోరు మోటర్ ను శుక్రవారం రామగిరి తాసిల్దార్ సుమన్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహేష్ సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఆదివార పేటకు చెందిన ఏలువాక శంకరయ్య అనుమతి లేకుండా వ్యవసాయ బోరు వేసి మోటార్ బిగించడంతో బాధితుడు వెంకటేష్ చేసిన ఫిర్యాదు మేరకు జల భూగర్భ, రెవెన్యూ శాఖ అధికారులు అధికారులు విచారణ చేపట్టారు. ఇరు శాఖల అధికారులు సంయుక్త విచారణలో అనుమతి లేకుండా బోరు వేశారని తేలడంతో అట్టి వ్యవసాయ బోరును సీజేసినట్లు అధికారులు తెలిపారు. బోర్ మోటార్ సీజ్ నిబంధనల ను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

## రామగుండంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ త్వరగా ప్రారంభించాలని సీఎంను కోరిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్





**జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, రామగుండంలో 1%ఇ%800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్ ప్లాంట్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, ఇప్పటికే బోర్డు ఆమోదం లభించిందని, పాత జెన్కో ప్లాంట్ స్థలంలో కొత్త ప్లాంట్ నిర్మాణానికి త్వరలో చర్యలు ప్రారంభమవుతాయని తెలిపారు.ఈ ప్లాంట్ ఏర్పాటుతో రామగుండం ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధి వేగవంతం అవడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.అదనంగా, ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం రామగుండం మున్సిపల్ అభివృద్ధి కోసం ?40 కోట్లు మంజూరు చేసింది.అలాగే, పాలకుర్తి మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలనే అంశంపై ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించారు. ఈ ప్రాజెక్ట్ అమలు అయితే తాగునీరు, సాగునీటికి ఎలాంటి కొరత ఉండదని తెలిపారు.రామగుండం ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, “ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే రామగుండం అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుంది” అని తెలిపారు.

# నీటి సరఫరా నిర్వహణ నాణ్యత పరీక్ష లీకేజీల మరమ్మత్తులో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం



**జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
అమృత్ మిత్ర ఇన్షియేటివ్ లో భాగంగా నీటి సరఫరా నిర్వహణ, నాణ్యత పరీక్ష, లీకేజీల మరమ్మత్తు తదితర పనుల్లో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2. కింద రామగుండం నగర పాలక సంస్థ కు ప్రత్యేకంగా మంజూరైన రూ 65.00 లక్షలతో ఏడు ప్యాకేజీలతో వివిధ పనులు స్వశక్తి మహిళా సభ్యులతోనే చేపట్టి వారికి జీవనోపాది కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ పనులను చేయడానికి ఆశక్తి , అర్హతలు ఉన్న స్వశక్తి మహిళలను గుర్తించాలని మెప్మా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక నైపుణ్యం అవసరం ఉన్న పనులు



చేపట్టడానికి వీలుగా నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ సెంటర్ , స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ సహకారంతో శిక్షణ కూడా ఇప్పించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఇంకుడు గుంతలు నిర్మించడానికి ఇంటింటా నిర్వహిస్తున్న సర్వే లో వార్డు అధికారులు , వార్డు అసిస్టెంట్ లతో పాటు ఆర్ పిలు కూడా పాల్గొనాలని అన్నారు . నవంబర్ 1, 2021 తర్వాత నల్లా కనెక్షన్ పొందిన వారి కనెక్షన్ ఫోటోలు , డాక్యుమెంట్లు అమృతమ్ యాప్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ మారుతీ ప్రసాద్ , ఎస్ ఇ గురువీర , ఇ ఇ . పి వి రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు , మెప్మా టి ఎం సి మౌనిక , సి ఓ లు పాల్గొన్నారు.

# రండి... కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దాం



## ఉమ్మడిగా పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులు చేపడదాం ప్రఖ్యాత ‘మోనాష్’ యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక భేటీ

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 24 అక్షరం న్యూస్**
అడ్వాన్స్డ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్, క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత ‘మోనాష్’ యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారులి. ఇక్కడి ప్రముఖ విద్యా సంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌లు, కో-ఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్ ను చేపట్టాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మెల్బోర్న్ లోని ప్రఖ్యాత ‘మోనాష్’ యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పరిశోధన, ఇన్నోవేషన్ బేస్డ్ కొలాబరేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ , స్టార్టప్ ల భాగస్వామ్యం తదితర అంశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను ‘గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, టీ హబ్, టీ వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. “గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్” మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్-ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ లే హై వూ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ థామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్బని వెంకట్‌పై కావాలని కుట్రలు చేస్తున్నది ఎవరు?

## ప్రజలు కావలసిన సౌకర్యాలు, అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడతారా ? సబ్బని సోషల్ మీడియా అకౌంట్స్ ను తొలగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు. సబ్బని వెంకట్ యువసేన హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్. రాజు పిట్టల

**కరీంనగర్/హుజురాబాద్/అక్టోబర్ 24/అక్షరం న్యూస్:**
ప్రముఖ జెన్ పాక్ట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ పై కావాలని కొంతమంది కుట్రలు చేస్తున్నారని, ప్రజల అవసరాల కోసం ప్రశ్నిస్తే వ్యక్తిగత కుట్రలకు పాల్పడతారా? అని సబ్బని వెంకట్ యువసేన నియోజక వర్గ, హుజురాబాద్ టౌన్ ఇంచార్జ్ రాజు పిట్టల అన్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన సబ్బని వెంకట్ సాఫ్ట్వేర్ కంపెనీలో ఉన్నతమైన స్థాయిలో ఉండి తన పుట్టిన ప్రాంతానికి తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా కానీ నేనున్నానంటూ రాత్రి అనకా పగలు అనక ఎవరు ఫోన్ చేసినా వెంటనే స్పందించి వారికి ఏ అవసరం ఉన్నా కూడా వెంటనే స్పందించి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు కొంతమంది వ్యక్తిగతంగా టార్గెట్ చేసి సోషల్ మీడియాలో ఎక్కువ ఫాలోవర్స్ ఉన్న గ్రూప్స్ ఏవైతే ఉంటాయో వాటిని రిపోర్ట్ కొట్టిస్తూ డిలీట్ అయ్యే విధంగా గ్రూపులను డిలీట్ చేస్తున్నట్లు రాజు పిట్టల తెలిపారు. నియోజకవర్గంలో ఏ గ్రామం నుండి యువత మాకు ఎలాంటి ఉపాధి లేదు అని వచ్చిన నిరుద్యోగులకు తనకు ఉన్న పరిచయాలతో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తూ నియోజకవర్గంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే స్థానికంగా నూతన ఫ్యాక్టరీలను తీసుకురావాలని అధికార పార్టీలను నిలదీస్తున్నందుకా సబ్బనిపై కుట్రలు అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం ఉంటే పట్టణ ప్రాంతాలకు ప్రజలు ఎవరు వెళ్లారనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రుల్లో గుండె వైద్య నిపుణులు ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను కలసి వినతి పత్రం ఇచ్చిన సంగతి నియోజకవర్గ ప్రజలకు తెలుసని అన్నారు. సబ్బని వెంకట్ ను కుట్రలు కుతంత్రాలు చేసి ఏమి చేయలేరని ఏమైనా ఉంటే సబ్బని వెంకట్ ప్రజల కోసం ఏవైతే కావాలని ప్రభుత్వాలను కోరుతున్నారో చేసి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలి కానీ ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడితే తగిన విధంగా సబ్బని వెంకట్ యువసైన్యం చూస్తూ ఊరుకోదని ప్రతి చర్యకు దిగుతామని హెచ్చరించారు.



# కస్తూర్బా బాలికల విద్యాలయని సందర్శించిన జాటోత్ హుస్సేన్ నాయక్



**మహబూబాబాద్ /కేసముద్రం /అక్టోబర్ 24/అక్షరం న్యూస్ :-**
మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కేసముద్రం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని అధికారులతో కలిసి సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అడిగి తెలుసుకున్న వెంటనే స్టేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలాస్ ఐఏఎస్ కి ఫోన్ కాల్ ద్వారా వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరించాలని కోరిన జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ కోరారు.

# స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

## లింగ నిర్ధారణ చట్టం ఉల్లంఘనకు కఠిన చర్యలు -జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వి. వాణిశ్రీ



**ఎద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 24 అక్షరం న్యూస్**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డా. ప్రసాద్ మెమోరియల్, లీలావతి నర్సింగ్ హోమ్, శ్రీదేవి హాస్పిటల్, రమా హాస్పిటల్‌లలో గల స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో రిజిస్టర్డ్ గైనకాలజిస్ట్ ద్వారానే స్కానింగ్ జరుగుతోందా, గర్భిణీల స్కాన్ వివరాలు రికార్డుల్లో మరియు ఫారం-ఎఫ్‌లో సమగ్రంగా నమోదు చేయబడుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాలలో "ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు %-% ఆడ, మగ అని చెప్పబడదు" అనే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా డా. వాణిశ్రీ మాట్లాడుతూ, "ఆడ పిల్లలు తక్కువగా పుడుతున్నందున సమాజంలో లింగ సమతౌల్యం దెబ్బతింటోంది. గర్భస్థ శిశువు లింగం తెలుసుకోవడం చట్ట విరుద్ధం. లింగ నిర్ధారణ చేసినా, అడిగినా 3 సంవత్సరాల జైలుశిక్షతో పాటు ?10,000 జరిమానా విధించబడుతుంది" అని హెచ్చరించారు. ఆమె మరింతగా మాట్లాడుతూ, "పుట్టబోయే పిల్లలు ఆడ అయినా, మగ అయినా సమానమే. ఆడవారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. సంతానం కోసం తహతహలాడుతున్న వారు ఉన్న ఈ సమాజంలో ఆడ పిల్లలను వద్దనుకోవడం మహా పాపం" అని పేర్కొన్నారు. ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా లింగ నిర్ధారణ జరిగిందని నిర్ధారణ అయితే, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు డా. లక్ష్మీ భవానీ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎస్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జాగృతి జిల్లా అధ్యక్షుడిగా కోదాటి శ్రీనివాసరావు



**పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 24 అక్షరం న్యూస్**
తెలంగాణ జాగృతి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా కోదాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ నియామకాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సాంస్కృతిక, సామాజిక అంశాలపై పనిచేస్తున్న తెలంగాణ జాగృతి సంస్థ బలోపేతంలో భాగంగా ఈ నియామకం జరిగినట్లు సమాచారం. నూతనంగా నియమితులైన శ్రీనివాసరావు పెద్దపల్లి జిల్లాలో జాగృతి కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తారని సంస్థ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. కోదాటి శ్రీనివాసరావు నియామకం పట్ల ఆయన అభిమానులు, జిల్లా ప్రజలు, జాగృతి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ జాగృతి లక్ష్యాల సాధనకు ఆయన నాయకత్వం ఉపకరిస్తుందని వారు పేర్కొన్నారు

# అనారోగ్యంతో జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /అక్టోబర్ -24(అక్షరం న్యూస్ )**
అనారోగ్యంతో. జీవితంపై విరక్తితో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముస్తాబాద్ మండల కేంద్రం లో చోటు చేసుకుంది. మండలకేంద్రానికి చెందిన మానుక బక్కయ్య (88)గత కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధులు ఐనా బిపి, షుగర్, టీబి. లతో బాధపడుతూ, మందులు వాడిన తగ్గడం లేదని బాధపడుతూ గురువారం జీవితం పై విరక్తి తో ఇంట్లో ఎవరు లేని సమయం లో దూలనికి ఉరి వేసుకొని మృతి చెందాడని ఎస్ ఐ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడి కొడుకు మానుక మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.



# జిహెచ్ఎంసి పార్కును ఆకస్మికంగా పరిశీలించిన సి ఎం రేవంత్ రెడ్డి వెంట ఎమ్మెల్యే మక్కాన్సింగ్









**జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 లో నిర్మాణంలో ఉన్న జీహెచ్ఎంసీ పార్కు పనులను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆయన వెంట రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కూడా ఉన్నారు. రామగుండం సమస్యలు వివరించడానికి వెళ్లిన మక్కాన్సింగ్ ను ఆయన వెంట తీసుకెళ్లారు. గతంలో చెత్తా చెదారంతో నిండి ఉన్న ఈ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా%ా% పార్కు నిర్మాణం చేయాలని కొద్ది రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు ఈ నేపథ్యంలో పనులు జరుగుతున్న తీరును ఈ రోజు పరిశీలించారు. పార్క్ లో పనిచేస్తున్న కార్మికులతో కొద్ది సేపు ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాను. ముఖ్యమంత్రితో చాలాసేపు గడిపిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ముఖ్యమంత్రి శైలిని దగ్గరుండి పరిశీలించారు.

# సింగల్ విండో మరియు ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ రమణారావు



**ఓదెల/ పెద్దపల్లి అక్టోబర్ 24(అక్షరం న్యూస్)**
ఓదెల మండలంలోని గుండ్లపల్లి కనగర్తి పిట్టల ఎల్లయ్యపల్లి హరిపురం గ్రామాలలో సింగిల్ విండో మరియు ఐకెపి ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు క్షేమమే ప్రభుత్వ కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాల్లో ముందుకు పోతుందని అన్నారు ఇప్పటికే 200 యూనిట్లు కరెంటు మాఫీ రైతుల రుణమాఫీ మహిళలకు ఉచిత బస్సు అరులకు రేషన్ కార్డుల పంపిణీ పదిలక్షల ఆరోగ్యశ్రీ మహిళలకు జీరో వడ్డీ రుణాలు ఎన్నో పథకాలతో ముందుకు పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో. ఐకెపి ఎపిఎం సంపత్. సిసి మారెల్లి శ్రీనివాస్ సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి. పిట్టల రవికుమార్ ముదిరాజ్ గోపు నారాయణరెడ్డి. పుప్పాల శంకర్. ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ గుండేటి ఐలయ్య యాదవ్ జైపాల్ రెడ్డి విజేందర్ రెడ్డి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు. చొప్పరి రాజయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

# బ్రిడ్జి తీసి స్యాడ్ రోడ్డు వేయని కాంట్రాక్టర్లు, అధికారులు, వాహనా దారులకు తప్పని ఇబ్బందులు





**మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ అక్టోబర్ 24(అక్షరం న్యూస్)**
గంగారం మండలంలో మర్రిగూడెం గ్రామంలో మంత్రివర్యులు సీతక్క గారి ఆదేశాలతో బ్రిడ్జిని ముదుకోట్ల ఆరువై లక్షలతో గంగారం నుండి కామారం వరకు డబల్ రోడ్డు అభివృద్ధి పనులు అనుమతిని మంత్రి సీతక్కగారికి అభినందనలు శుభాకాంక్షలు తెలుపుతున్నము. కానీ పంచాయితీ రాజ్ ఇంజనీర్లు కాట్రాక్టర్ మిలకత్ అయి మర్రిగూడెం పెద్దమనుషులు, మాజీ ప్రజాప్రతినిధులకు తేలపకుండా బ్రిడ్జి ప్రారంబొత్సవం చేసి రెండు వరాలు గడిసిన స్యాడ్ రోడ్డు లేక వాహనాలు నడవక చాలా ఇబ్బంది పడుతున్న వాహనాదరులు, సైకిల్ మోటార్ వెళ్లాలన్న చాలా ఇబ్బందులు పడుతున్నారు, రోడ్డు ను చూసి తిరిగి మహాదేవునిగూడెం నుండి వెళ్లిపోవలసి వస్తుంది. రెండు ఆటో లు దిగబడిన సందర్భాలు ఉన్నాయి. కాంట్రాక్టర్ గారికి చెప్పినా శ్రద్ధ పెట్టడం లేదు. పంచాయితీ రాజ్ ఏఈ , డిఈ, మరియు కాంట్రాకర్ పై జిల్లా కలెక్టర్ గారు తగిన చర్యలు తీసుకోవాలని దుబ్బాగూడెం నుండి గంగారం మండలానికి వెళ్లే వాహనాదరులు కోరుచున్నారు.

# రఘునాథపల్లి మండల కేంద్రంలో చోరీ

**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)అక్టోబరు 24:**
రఘునాథపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని బచ్చు వేణుగోపాల్, బచ్చు మురళీకృష్ణ అనే ఇద్దరు అన్నదమ్ములు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ లో బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.20 వేల నగదుతో పాటు మూడు తులాల వెండి అభరణాలను దొంగిలించారు. హైద్రాబాద్ నుండి శుక్రవారం తిరిగి వచ్చిన వేణు. మురళీకృష్ణకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు తెలిసింది. ఇదే రాత్రి మం డల కేంద్రంలో ఇంటి ముందు పార్కు చేసి ఉన్న పాశం బన్నీకి చెందిన మోటారు సైకిల్ సైతం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐఐ డి.నరేష్ తెలిపారు.



## రక్తదాన శిబిరంలో 140 యూనిట్ల రక్త సేకరణ

### పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో నిర్వహణ



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 24 అక్షరం న్యూస్**

పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ గారు హాజరై రక్తదాతలను ఉద్దేశించి ప్రసంగించారు. రక్తదానం ప్రాముఖ్యతను వివరించిన ఆయన, రక్తదానం చేయడం మనిషి చేయగల అత్యున్నత సేవల్లో ఒకటని పేర్కొన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ పెద్దపల్లి గజ్జి కృష్ణ, సీఐ పెద్దపల్లి ప్రవీణ్ కుమార్, సీఐ మహిళా పోలీస్ స్టేషన్ , సీఐ సుల్తానాబాద్ , సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు. మొత్తం 140 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎస్ఐ శ్రీ జె. లక్ష్మణ్ రావు సమన్వయం చేశారు.

## గ్రామ స్థాయిలో శుభ్రత, పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశం

### ...జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖ సమీక్షా సమావేశం



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 24 అక్షరం న్యూస్**

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని %×ఙూజ% మీటింగ్ హాల్‌లో ఈరోజు జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో పన్నుల వసూళ్లు, సానిటేషన్, విజిబుల్ క్లీన్లినెస్, ప్రజా సంస్థల పరిశుభ్రత, వ్యర్థాల వేరు వేరు సేకరణ షెడ్ల నిర్వహణ, ఫాగింగ్, పౌరసేవలు, ట్రేడ్ లైసెన్సుల క్లియరెన్స్, తాగునీటి సమస్యలు, క్లోరినేషన్, రికార్డుల నవీకరణ, % యాప్ వినియోగం, ) వంటి అంశాలపై సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి గారు మాట్లాడుతూ, అధికారులు గ్రామస్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు, వంద శాతం పన్నుల వసూళ్లు, ప్రజా సేవల సమర్థవంతమైన అందజేతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పై ఎజెండా అంశాల అమలులో ఏ నిర్లక్ష్యం చోటు చేసుకున్నా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారులు పెద్దపల్లి, మంథని, ఈఈ హౌసింగ్ మరియు ఈఈ మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సీలింగ్ ఫ్యాన్ల బహుమతి




**మహబూబాబాద్ /కేసముద్రం /అక్టోబర్ 24/అక్షరం న్యూస్ :**

-కేసముద్రం మండలంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థానిక లక్ష్మి ఐరన్ షాప్ యజమాని కరివేదుల కృష్ణా రెడ్డి 20 వేల విలువైన 8 ఫ్యాన్లు అందచేశారు.ఈ సందర్భంగా కృష్ణా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయి కి ఎదగాలని అన్నారు.ప్రిన్సిపాల్ డా. డి. రాజు మాట్లాడుతూ కళాశాలకు విలువైన ఫ్యాన్లు అందచేసిన వ్యాపారావేత్త కృష్ణా రెడ్డి కి ధన్యవాదములు తెలుపుతూ స్థానికులు కూడా ఆదర్శంగా తీసుకొని కళాశాలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని సంతోషం వ్యక్తం చేసారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శించిన మాజీ ఎంపీ.



**మహబూబాబాద్ /కేసముద్రం /అక్టోబర్ 24/అక్షరం న్యూస్ :-**

ఇటీవల అకాల మరణం చెందిన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిరెడ్డి వెంకట్ రెడ్డి తల్లి,రాష్ట్ర యువనాయకులు ముదిరెడ్డి శ్రావణ్ నానమ్మ కీ?శే? ముదిరెడ్డి నర్సమ్మ చిత్తపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన భారాస జిల్లా అధ్యక్షులు మహబూబాబాద్ మాజీబిపార్లమెంటు సభ్యులు కవిత మాలోత్ వీరి వెంటవీరి వెంటకముటం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఢిల్లీలో జరిగిన సిఐఎస్ఎఫ్ అమరవీరుల నివాళిలో పాల్గొన్న అప్పన్న సతీమణి సరోజ

**జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

సీఎస్ఐఎఫ్ అమరవీరుడు పొటుపురెడ్డి అప్పన్నకు జాతీయ స్థాయిలో ఘన నివాళిన్యూఢిల్లీ చాణక్యపురిలోని జాతీయ పోలీస్ స్మారక స్థూపం వద్ద సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఐదు మంది అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారిలో ఒకరైన శ్రీమతి సరోజినీ దేవి , తన భర్త లేట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పొటుపురెడ్డి అప్పన్నజ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పొటుపురెడ్డి అప్పన్న రామగుండం ఎన్ టి పి స యూనిట్‌లో పనిచేసిన సమయంలో విధి నిర్వాహణలో ప్రాణాలు అర్పించిన ధైర్యవంతుడైన సిఐఎస్ఎఫ్ జవాన్.ఘోర నక్సలైట్ దాడి ఘటన:2003లో సిఐఎస్ఎఫ్‌లో చేరిన పొటుపురెడ్డి అప్పన్న గారు ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా, డామంజోడి ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్నారు. 2009 ఏప్రిల్ 12వ తేదీ రాత్రి 9.15 గంటలకు భారీగా ఆయుధాలు కలిగిన నక్సలైట్లు నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ప్రాంగణంలో ఉన్న సిఐఎస్ఎఫ్ మైన్స్ బారక్ మరియు ముఖ్య నియంత్రణ గదిపై ఒకేసారి దాడి చేశారు.%ాఖ%-47 రైఫిల్స్, గ్రెనేడ్లు, పెట్రోల్ బాంబులు, స్వదేశీ తుపాకులు, %×జుణ%లతో దాడి చేసిన నక్సలైట్లను ఎదుర్కొంటూ పొటుపురెడ్డి అప్పన్న గారు అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారు.మూడు వైపుల నుండి జరిగిన తీవ్రమైన కాల్పుల్లో ఆయన, సహచర సిబ్బందితో కలిసి వీరోచితంగా పోరాడారు. చివరికి దేశ సేవలో తన ప్రాణాలను త్యాగం చేశారు.జాతీయ స్మారక స్థూపంలో నివాళులు:ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు





వాలర్ వాల్ వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరులకు ఘనంగా నివాళి అర్పించారు. తరువాత వారు జాతీయ పోలీస్ మ్యూజియాన్ని సందర్శించి, వీరుల ధైర్యగాథలను ప్రతిబింబించే వీడియోలను వీక్షించారు.ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ రామగుండం యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్ గారు పాల్గొని, అమరవీరుల త్యాగాలను స్మరించారు. ఆయన మాట్లాడుతూ ౹ "దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన సిఐఎస్ఎఫ్ వీరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది. వారి కుటుంబాలకు సిఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని తెలిపారు.

## బిజేపి జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ని పరామర్శించిన జాతీయ ఎస్ టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్.

**మహబూబాబాద్ /కేసముద్రం /అక్టోబర్ 24/అక్షరం న్యూస్**

:-కేసముద్రం టౌన్ కు చెందిన బిజేపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాతృమూర్తి శ్రీమతి వల్లభు లక్ష్మి ఈ నెల 15 రోజున మృతి చెందడడంతో జాతీయ ఎస్ టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శుక్రవారం వల్లభు వెంకటేశ్వర్లు స్వగృహానికి వెళ్లి వారి తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్,బిజెపి కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ,మండల ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వర చారి,మండల ఉపాధ్యక్షురాలు నగరబోయిన చంద్రకళ సీనియర్ నాయకులూ మల్యాల రాములు,జాటోత్ నరేష్,జాతోత్ రమేష్, పలు గ్రామాలనాయకులు పాల్గొన్నారు.




# పాత్రికేయులు సామాజిక సేవకులు

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య పాత్రికేయులను పరామర్శించిన ఈర్ల సమ్మయ్య

**పెద్దపల్లి రూరల్, అక్టోబర్24 అక్షరం న్యూస్:**

పాత్రికేయులు సామాజిక సేవకులని,పాత్రికేయ వృత్తి కత్తి మీద సాములాంటిదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు.శుక్రవారం ఆయన ప్రముఖ సీనియర్ పాత్రికేయులు రావి కోటేశ్వరలింగం శ్రీరాంపూర్,జిలుకర రమేష్ మొట్లపల్లి ల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని, బాగోగులను అడిగి తెలుసుకున్నారు.రావి కోటేశ్వర లింగం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గుర య్యారు.గత నాలుగు నెలలుగా వైద్యుల సూచన మేరకు ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నారు.బెడ్ రెస్ట్ తీసుకుం టున్నారు.అనారోగ్యం కారణంగా అతడు బయ టికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో ఈర్ల సమ్మ య్య కోటేశ్వరలింగం ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శిం చారు. యోగక్షేమాలు,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు.అలాగే మరో ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు జిలుకర రమేష్ మొట్లపల్లి ను పరామర్శించారు.అతని ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.రమేష్ కాలికి తీవ్ర గాయమై,ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సర్జరీ చేసుకున్న విషయం పాఠకులకు విధితమే.అతడు రెండు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జయి మొట్ల పెల్లిలోని





తన ఇంటికి వచ్చాడు.విషయం తెలుసుకున్న ఈర్ల సమ్మ య్య శుక్రవారం మొట్లపల్లిలోని అతని నివాసాన్ని సందర్శించి,పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.పాత్రికేయులు రావి కోటేశ్వరలిం గం ,జిలు కర రమేష్‌లు త్వరగా కోలుకోవాలని ఈర్ల సమ్మయ్య ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లా డుతూ పాత్రికేయ వృత్తి ఎంతో గొప్పదని, సమాజంలో మార్పు తీసుకురావడానికి రాత్రింబగళ్లు వారు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.ఆయన వెంట ప్రముఖ కళాకారుడు పాల శంకర్ ఉన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డినీ కలిసిన కేసముద్రం ముజ్జు షేక్.

**మహబూబాబాద్ /కేసముద్రం /అక్టోబర్ 24/అక్షరం న్యూస్ :-**

హైదరాబాద్ లోనిజూబ్లీహిల్స్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కేసముద్రం యూత్ కాంగ్రెస్ నాయకుడు ముజ్జు షేక్ మర్యాదపూర్వకంగా కలిశారు. కేసముద్రం మండల పరిస్థితులపై, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వివరించినట్లు ఈసందర్భంగా ముజ్జు తెలిపారు.



# ప్లాట్‌ఫామ్ టికెట్ ఎందుకు తీసుకోవాలి

ఇండియాలో రైళ్లలో వెళ్లే సంఖ్య ఎక్కువే. సుదూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు రైళ్లను ఎంచుకుంటారు. ప్రతీ రోజు కోట్లాది మంది ప్రజలు రైళ్లలో ప్రయాణం చేస్తుంటారు. సాధారణంగా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా.. మరికొందరు వారిని సాగనంపేందుకు స్టేషన్లకు వెళ్తుంటారు. అయితే రైల్లో ప్రయాణం చేయని వ్యక్తులు తప్పనిసరిగా ఫ్లాట్ ఫామ్ టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది దశాబ్దాల నుంచి ఉంటున్న నిబంధన. ప్రస్తుతం రైల్వే స్టేషన్లలో ఫ్లాట్ ఫాం టికెట్ ధర రూ.10. ఈ టికెట్‌ను తీసుకుంటే దాదాపు రెండు గంటల పాటు రైల్వే స్టేషన్‌లలో ఉండొచ్చు. ఇంతకీ ఫ్లాట్ ఫాం టికెట్ కచ్చితం ఎందుకు.. ఒకవేళ ఈ టికెట్‌ను తీసుకోకపోతే ఏం జరుగుతుంది. ఫ్లాట్ ఫామ్ టికెట్ వెనక అసలు ఉద్దేశం ఏంటో ఇప్పుడు చూద్దాం.

ఫ్లాట్ ఫామ్ టికెట్ ప్రధాన ఉద్దేశం.. ఫ్లాట్ ఫామ్ టికెట్ ప్రధాన ఉద్దేశం రైల్వే స్టేషన్‌లో రద్దీని తగ్గించడమే. రైళ్లల్లో ప్రయాణం చేయని వ్యక్తులు వారి బంధువులను సాగనంపేందుకు స్టేషన్లకు వస్తుంటారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్లలో రద్దీ అధికంగా ఉంటుంది. రద్దీని నివారించడానికే ఫ్లాట్‌ఫామ్ టికెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 1950 నుంచి ఈ విధానం అమలులో ఉంది. రద్దీని నియంత్రించడానికి, భద్రతను పెంపొందించడానికే ఈ విధానాన్ని రూపొందించారు. న్యూఢిల్లీ, హౌరా, చెన్నై సెంట్రల్ వంటి పెద్ద స్టేషన్‌లలో రోజుకు లక్షలాది మంది ప్రయాణిస్తుంటారు. వీరిని సాగనంపేందుకు చాలా మంది వస్తుంటారు. ఈ క్రమంలో ఫ్లామ్‌ఫామ్‌ను టికెట్‌ను కచ్చితం చేశారు. ఈ టికెట్ లేకుండా ప్రవేశిస్తే రద్దీ అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ టికెట్ తీసుకున్న వారి వివరాలు రికార్డు అవుతాయని.. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంలో సహాయపడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

టికెట్ తీసుకోకపోతే జరిగే పరిణామాలు..ఫ్లాట్‌ఫామ్ టికెట్ లేకుండా రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశిస్తే జరిమానా తప్పదు. భారత రైల్వే చట్టం 1989, సెక్షన్ 55 ప్రకారం ఫ్లాట్ ఫామ్ టికెట్ లేకుండా ప్రవేశం నిషేధం. ఫ్లాట్‌ఫామ్ టికెట్ లేని వారు టికెట్ చెకింగ్ సిబ్బందికి చిక్కితే..రూ.250 నుంచి రూ.500 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జరిమానాను చెల్లించని పక్షంలో చట్టమైన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. లేదా స్టేషన్ నుంచి బయటకు పంపించేస్తారు. అంతే కాకుండా టికెట్ లేని వ్యక్తులను అనుమానాస్పదంగా భావించి వారిని విచారించే అవకాశమూ ఉంటుంది. అయితే కొన్ని రైల్వేస్టేషన్‌లలో టికెట్ కౌంటర్లు లేక, ఆన్‌లైన్ టికెట్ సౌలభ్యం సరిగా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

ఈ టికెట్ నుంచి మినహాయింపు ఎవరికంటే..ఫ్లాట్‌ఫామ్ టికెట్ విషయంలో పలువురికి మినహాయింపులు కూడా ఉన్నాయి. వికలాంగులు, వృద్ధులు, అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన వారు ఆర్‌పీఎఫ్ అనుమతితో ఫ్లాట్‌ఫామ్ పైకి వెళ్లే వెసులుబాటు ఉంటుంది. కరోనా సమయంలో (2020-2022) రద్దీని తగ్గించేందుకు ఫ్లాట్‌ఫామ్ టికెట్ విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కరోనా అనంతరం ఫ్లాట్ ఫామ్ టికెట్ యధావిధిగా ప్రారంభమయ్యాయి. యూటీఎస్ యాప్ ద్వారా కూడా ఫ్లాట్‌ఫామ్ టికెట్‌ను కొనుక్కునే వెసులుబాటును కల్పించింది రైల్వే శాఖ.

ప్రజలు ఏమంటున్నారు.ాగా.. ఫ్లాట్‌ఫామ్ టికెట్‌కు సంబంధించి ప్రజల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. రద్దీని తగ్గించేందుకు ఫ్లాట్‌ఫామ్ టికెట్‌లు ఉపయోగపడతాయని.. కానీ చిన్న స్టేషన్‌లలో ఈ టికెట్ అవసరం లేదని కొందరు చెబుతుండగా... టికెట్ కౌంటర్ల వద్ద క్యూలు, ఆన్‌లైన్ సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మరికొందరు చెబుతున్నారు.ఫ్లాట్‌ఫామ్ టికెట్ అనేది రైల్వేస్టేషన్‌లో రద్దీని, భద్రతా పరమైన సమస్యలను నియంత్రించేందుకు రూపొందిన విధానం. ఈ టికెట్‌ను తీసుకోకపోతే జరిమానా తప్పదు. అలాగే ఈ విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ సౌకర్యాన్ని మెరుపరిస్తే ప్రజలకు ఇబ్బందులు అవకాశం ఉంటుంది. ఈ టికెట్ విధానం ద్వారా రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని, భద్రతను కాపాడుతూనే ప్రయాణికుల సౌలభ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి అవసరం ఉంది.

# బిజినెస్




## బ్యాడ్ న్యూస్

బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపేణా డబ్బు పొదుపు చేసిన వారికి బ్యాడ్ న్యూస్ చెబుతున్నాయి దేశ వాణిజ్య బ్యాంకులు. ఇప్పటికే సవరించిన వడ్డీ రేట్లు అమల్లోకి వచ్చేశాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీని ఇప్పుడు బ్యాంకులు తగ్గిస్తున్నాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకులు సదరు వడ్డీ రేట్లను సవరించాయి. సవరించిన రేట్లు అమల్లోకి వచ్చేశాయి కూడా. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తగ్గించిన వడ్డీ రేట్లను ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి తీసుకురాగా, ప్రభుత్వరంగ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమృత్ కలశ్ పేరిట అందిస్తున్న స్పెషల్ డిపాజిట్ స్కీమ్‌ను మార్చి 31తో నిలిపివేసి చేతులు దులుపుకుంది. 2023 ఏప్రిల్ నుంచి 400 రోజుల కాలపరిమితితో ఈ డిపాజిట్ స్కీమ్‌ను ఎస్బీఐ అందించేది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) ద్రవ్య విధాన కమిటీ సమావేశం 2025 ఏప్రిల్ 7-9 తేదీల్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో రెపో రేటు మరికొంత తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మూడు ప్రముఖ బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంకు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించాయి. ఏప్రిల్ 3, 2025 నాటికి, ఈ బ్యాంకులు కొన్ని నిర్దిష్ట గడువులపై వడ్డీ రేట్లను 25 నుంచి 50 బేసిస్ పాయింట్ల వరకు (1 బేసిస్ పాయింట్ = 0.01 శాతం) తగ్గించినట్లు ప్రకటించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండు ఎంపిక చేసిన కాలవ్యవధుల డపాజిట్లపై ఎఫ్‌డీ రేట్లను తగ్గించింది. 35 నెలల కాలవ్యవధి కలిగిన ఎఫ్‌డీపై 35 బేసిస్ పాయింట్లు, 55 నెలల ఎఫ్‌డీపై 40 బేసిస్ పాయింట్లు మేర కోత పెట్టింది. ఇకపై ఈ రెండు కాల వ్యవధులపై రూ.3 కోట్ల లోపు రిటైల్ డిపాజిట్లపై గరిష్ఠంగా 7 శాతం మాత్రమే వడ్డీ లభించనుంది. సీనియర్ సిటిజన్లకు 50 బేసిస్ పాయింట్లు అదనం. 21 నెలల కాలవ్యవధిపై మాత్రం అత్యధికంగా 7.25 శాతం వడ్డీని అందిస్తోంది.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## పీఎం మోదీ ఏడాదిలో 300 రోజులు తినే మఖానా స్పెషల్



ఎండాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అలాగే ఈ పదార్థాన్ని కూడా రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే మంచిదని కొద్ది మందికే తెలుసు. అదే సూపర్ ఫుడ్ అని పిలిచే మఖానా. వీటినే తామరగింజలు అని కూడా అంటారు. సాధారణంగా అందరూ మఖానాను అల్పాహారంగానే తీసుకుంటారు. ఇలా చిరుతిండిగా తినే బదులు వేసవి కాలంలో మఖానా రైతా తిని చూడండి. ఎండలకు నీరసించిపోకుండా ఎంత ఉత్సాహంగా ఉంటారో మీకే తెలుస్తుంది. ప్రధాని మోదీ కూడా ఈ రెసిపీని ఏడాదిలో 300 రోజులు తినడం వల్లే ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానని అంటున్నారు. మరి, ఆలస్యమెందుకు. పెరుగుతో తయారు చేసే మఖానా రైతా తయారీ విధానం, ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందామా..

కావాలసిన పదార్థాలు:
పెరుగు- 2 కప్పులు
మఖానా- ఒక కప్పు
జీలకర్ర పొడి- తగినంత
ఉప్పు- తగినంత
కారం- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం:మఖానా రైతా చేయడానికి ముందుగా ఒక గిన్నెలో పెరుగు తీసుకోండి. అందులో మఖానా వేసి, జీలకర్ర పొడి, రుచికి తగిన ఉప్పు, కారం వేసి బాగా కలపండి. ఇప్పుడు పైన సన్నగా తరిగిన కొత్తిమీర వేయండి. అంతే.. ఎంతో రుచికరమైన, పోషకాలున్న మఖానా రైతా తయారైపోతుంది. దీనిని వేసవిలో తరచూ తింటే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలో వేడి తగ్గించి చల్లబరుస్తుంది.

మఖానా ఆరోగ్య ప్రయోజనాలు:కడుపు ఆరోగ్యంపెరుగులో కడుపు ఆరోగ్యానికి మేలు చేసే ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూ క్రమం తప్పకుండా వినియోగిస్తే జీర్ణక్రియ ప్రక్రియ సులభతరం చేస్తుంది. ఇక మఖానాలోని ఫైబర్ కూడా కడుపు సమస్యలను తగ్గిస్తుంది. వేసవి కాలంలో ఈ రెండు పదార్థాలు కలిపిన రైతాను తీసుకోవడం వల్ల అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు తొలగిపోతాయి.

శక్తి- వేసవిలో ఎండలు శరీరంలోని శక్తిని చాలా వేగంగా హరించివేస్తాయి. చెమట రూపంలో శరీరంలోని నీరంతా బయటికి వచ్చేస్తుంది. త్వరగా డీహైడ్రేట్ అయిపోతారు. అందుకే పెరుగు, మఖానా కలిపిన రైతా తింటే తక్షణమే ఎనర్జీ వస్తుంది. మఖానాలో కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. పెరుగులోని కాల్షియం, ప్రోటీన్ వంటి పోషకాలు మఖానాతో కలిపి తిన్నప్పుడు మరింత ప్రభావంతంగా పనిచేస్తాయి. శరీరానికి వెంటనే శక్తినివ్వడంతో పాటు ఎముకలను బలంగా చేస్తాయి.

హైడ్రేషన్- వేసవిలో శరీరంలో నీరు ఎక్కువగా తీసుకోవాల్సి వస్తుంది. దాహం వేసిన ప్రతిసారీ నీళ్లు లేదా కూల్ డ్రింక్స్ బదులుగా పెరుగు తీసుకుంటే కడుపు చల్లగా ఉంటుంది. శరీరం డీహైడ్రేట్ కాదు.

కొలెస్ట్రాల్- ఈ రోజుల్లో చాలా మంది కొలెస్ట్రాల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అది తగ్గించుకోలేక నానా తంటాలు పడుతుంటారు. కొలెస్ట్రాల్ తగ్గించుకోకపోతే ఇతర వ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉంది. అందుకే ఈ సమస్యకు పరిష్కారంగా మఖానా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్‌ను సులభంగా తగ్గించుకోవచ్చు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇందులోని తక్కువ ప్రొటీన్, సోడియం బీపీ నియంత్రించేందుకు సహాయపడుతుంది. తద్వారా గుండెపోటు సమస్యలు రాకుండా నివారించవచ్చు. ఇందులో గ్లైసెమిక్ స్థాయి కూడా తక్కువే కాబట్టి డయాబెటిస్ పేషెంట్లకు మరీ మంచిది. ఇందులోని సహజ ఆస్ట్రిజెంట్ లక్షణాలు కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తాయి. అలాగే ఎముకలను దృఢంగా చేస్తాయి. కాబట్టి, ఈ అల్పాహారాన్ని మీరు కూడా ఇప్పటినుంచి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మర్చిపోవద్దు.

## వంకాయ కూర అంటే ఇష్టమా.. ముందుగా ఇది తెలుసుకోండి..



వంకాయ కూర.. పేరు వింటేనే చాలా మందికి నోరూరుతుంది. వంకాయతో చేసే వివిధ రకాల కూరలను భోజనప్రియులు ఎంతో ఇష్టంగా భుజిస్తారు. వంకాయ కూర మీద ఎన్నో సామెతలు కూడా ఉన్నాయి. అంత ఫేమస్ మరి వంకాయ. అంతేకాదండోయ్.. వంకాయ టేస్ట్ పరంగానే కాదు.. ఆరోగ్యపరంగానూ భేష్ అని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అయితే, ఇక్కడో చిన్న కండీషన్ అప్లై కూడా చేస్తున్నారు. వంకాయ ఇష్టంగా తినేవారు ఇది తప్పకుండా తెలుసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అవును, వంకాయతో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు.. అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. వాటి విషయంలోనే కాస్త జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వంకాయ కూరతో అన్నం తిన్న తరువాత కొన్ని పదార్థాలు తీసుకోవద్దని వైద్య నిపుణులు చెబుతున్నారు. పొరపాటున వాటిని తీసుకుంటే.. దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. మరి వంకాయ తిన్న తరువాత వేటిని తీసుకోవద్దో ఈ కథనంలో తెలుసుకుందాం..

వంకాయతో పాటు వీటిని అస్సలు తీసుకోవద్దు..వంకాయ కూరతో ఆహారం తిన్న తరువాత పొరపాటు కూడా పాలు తీసుకోకూడదని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. వంకాయను పాలను వెంటవెంటనే తీసుకోవడంతో వలన జీర్ణ సంబంధిత సమస్యలు ఏర్పడుతాయట. వాస్తవానికి పాలు జీర్ణం కావడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అప్పటికే మనం తిన్న వంకాయలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇటు ఫైబర్ కంటెట్.. అటు పాలను ఒకేసారి తీసుకోవడం వలన ఈ రెండూ జీర్ణమవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఫలితంగా మలబద్ధకం, కడుపు నొప్పి వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. వీటితో పాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది.బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు పాలు తీసుకోవచ్చు. అప్పుడు పెద్దగా సమస్య ఉండదు. కానీ, అన్నం, వంకాయ కూర, పచ్చడి, పప్పుతో కూడిన భారీ భోజనం చేసిన తరువాత పాలు తీసుకోకూడదు. ఈ సమయంలో పాలు తాగితే జీర్ణ సమస్యలు వస్తాయి. పాలలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. అది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. ఇక చాలా మంది వంకాయ కూరతో అన్నం తిన్న తర్వాత పెరుగు తింటుంటారు. ఇలా చేయడం కూడా సరైనది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి రెండు కూడా వ్యతిరేక స్వభావాలను కలిగి ఉంటాయి. పెరుగు చల్లటి స్వభావం కలిగి ఉంటుంది. వంకాయ వేడి స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఫలితంగా జీర్ణ సమస్యలు అధికమవుతాయి.టీ, కాఫీ కూడా..చాలా మంది టిఫిన్ లేదా భోజనం చేసిన తర్వాత కాఫీ లేదా టీ తాగుతారు. ఇది కూడా ఆరోగ్యానికి హానీ తలపెడుతుంది. ఇక వంకాయతో చేసిన ఆహారం తిన్న తరువాత కాఫీ గానీ, టీ గానీ తాగితే తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. టీ టానిన్ రిచ్ డ్రింక్. వంకాయతో అన్నం తిన్న తరువాత టీ తాగడం వల్ల శరీరం పోషకాలను గ్రహించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో శరీరానికి కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయి. అందుకే.. వంకాయ తిన్న తరువాత టీ, కాఫీ అస్సలు తాగకండి.

మాంసం, వంకాయ..చాలా మంది వంకాయతో మాంసం కలిపి వండుతారు. కానీ, అలా చేయొద్దని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు ఆహారాలు కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు ఎక్కువ అవుతాయి. కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు అధికమవుతాయి. అంద్దు ఈ ఫుడ్ కాంబినేషన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత ఉత్తమం అని చెబుతున్నారు. ఇక ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారు వంకాయలు తినకూడదని చెబుతున్నారు. వంకాయ తింటే శరీరంలో రక్తం ఏర్పడే ప్రక్రియను ప్రభావితం చేస్తుందట. అందుకే.. రక్తహీనత సమస్యతో బాధపడేవారు వంకాయను తినొద్దని సూచిస్తున్నారు.

## జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) చొప్పదండి విద్యార్థి కి వెండి పతకం



చొప్పదండి/ కరీంనగర్,అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

డబ్ల్యుసీపీడీ సీనియర్ సిటిజన్ డిపార్ట్మెంట్ కరీంనగర్ వారు జిల్లా స్థాయిలో నషా ముక్తు భారత్ అభియాన్ అంశం సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు చొప్పదండి విద్యార్థి బి అక్షయ్ ( 9వ తరగతి) ద్వితీయ సాధించి వెండి పతకాన్ని సాధించాడని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఎండి జలీల్ తెలిపారు. మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాల గురించి సమాజంలో యువకులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని సాధించారు. కరీంనగర్లో జరిగిన ఈ బహుమతి ప్రధానోత్సవం లో కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్ గౌస్ అలాం గారు కరీంనగర్ నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లు ఈ విద్యార్థికి బహుమతి ప్రధానం చేశారు .ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్ మాట్లాడుతూ ఈ విద్యార్థికి శిక్షణ ఇచ్చి మన పాఠశాలకు డ్రాయింగ్ పోటీలలో పతకం సాధించేందుకు కృషి చేసిన డ్రాయింగ్ మాస్టర్ కోలపురి చంద్రశేఖర్ నుప్రత్యేకంగా అభినందించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు

## జి ఏస్ టి తగ్గింపు తో రైతులకు ఒక్కో ట్రాక్టర్‌పై 40 వేల నుండి లక్ష రూపాయలు ఆదా

**బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి**



చొప్పదండి /కరీంనగర్, అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

జీఎస్టీ తగ్గింపు రైతులకు వరంగా మారిందని ఒక్కో నూతన ట్రాక్టర్ కొనుగోలు పై ఏడు శాతం పన్నులు తగ్గడంతో ఒక్కో ట్రాక్టర్ పై నలభై వేల నుంచి లక్ష రూపాయల వరకు ధర తగ్గి రైతులకు మేలు కలుగుతుందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న జీఎస్టీ సంబరాల మాసోత్సవం లో భాగంగా బిజెపి నాయకులు చొప్పదండి పట్టణంలోని ట్రాక్టర్ షోరూమ్ సందర్శించారు. ఈ సందర్భంగా నూతన ట్రాక్టర్ కొనుగోలు చేస్తున్న రాగంపేట గ్రామానికి చెందిన సింగసాన్ని కనకయ్య ను శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి అతని అనుభవాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి ఫోరం మాజీ అధ్యక్షులు, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు జీఎస్టీ తగ్గింపుతో 19 వేల కోట్ల రూపాయల ఆదా కలుగుతుందని తెలంగాణ లో ఉన్న 84 లక్షల కుటుంబాలలో సగటున ఒక్కో కుటుంబానికి ఏటా 10 వేల నుండి 30 వేల రూపాయలు జీఎస్టీ తగ్గింపు తో ఆదా కలుగుతుందని కృష్ణారెడ్డి వివరించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ స్థానిక సంస్థల మండల కన్వీనర్ సింగిరెడ్డి భూమిరెడ్డి , జిల్లా కౌన్సిల్ సభ్యులు మాజీ ఎంపిటిసి గొల్ల సునంద గట్టయ్య, గన్ను నరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ విలాసాగరం అంజయ్య, రాపల్లి శ్రీనివాస్ , దామర మధుసూదన్ రెడ్డి, తాళ్లపల్లి రవి, గుండె వెంకటేష్, గొల్లపల్లి మునీందర్, మేకల రాములు, రాజేశం, సింగసాని నాగయ్య, కొమురయ్య, మల్లేశం, పోచమల్లు, సతీష్, ముత్యాల ప్రకాష్, కత్తెర్ల రాములు, కొమల్ల అంజయ్య,భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో మొహమ్మద్ అయూబ్ కు యూసుఫ్ గూడా డివిజన్లో ప్రచార బాధ్యతలు...



హైదరాబాద్ / అక్టోబర్ 24/ అక్షరం న్యూస్ –:

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులకు ప్రచార బాధ్యతలను అప్పగించడం జరిగింది. దీనిలో భాగంగానే వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన తెలంగాణ పి. సి. సి మెంబర్ మొహమ్మద్ అయూబ్ ని జూ బ్లీ హి ల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా డివిజన్లో ప్రచార బాధ్యతలకై నియమించడం జరిగినది. ఈ నియామకానికి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు ఇమ్రాన్ ప్రతాప్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపినారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకై నేటి నుండి యూసుఫ్ గూడా డివిజన్లో ప్రచారంలో పాల్గొంటానని తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం రాష్ట్రం లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను నియోజక వర్గ ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను సమన్వయ పర్చుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకై శక్తి వంచన లేకుండా శ్రమించి ప్రచారం చేస్తానని తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలంగాణ పి. సి. సి మెంబర్ వరంగల్ తూర్పు నియోజకవర్గ మొహమ్మద్ అయూబ్ అన్నారు.

## కర్నూల్ రోడ్ ప్రమాదం కలచివేసింది

- **సజీవ దహనం దురదృష్టకరం**
- **రాష్ట్ర మైనారిటీ నాయకులు డా. నయీమ్ ఖురేషి.**



భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం/ అక్టోబర్ 25/ అక్షరం న్యూస్ – : కర్నూల్ జిల్లాలో శుక్రవారం తెల్లవారు ఝామున జరిగిన రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని, దాదాపు 20 మంది దహనమై మృతి చెందటం తనను కలచి వేసిందని రాష్ట్ర మైనార్టీ నాయకులు డాక్టర్ నయీం ఖురేషి ఆవేదన వ్యక్తం చేశారు. స్లీపర్ బస్సులు విపరీతమైన వేగం తో వెళ్తున్నాయని, తగిన ఫిట్నెస్ కూడా ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ బస్సుల వేగాన్ని నియంత్రించి, తగిన ఫిట్ నెస్ లేని వాటిని రోడ్డుపై తిరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిద్ర లోనే ఈ లోకాన్ని విడిచి వెళ్లిన వ్యక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం వారి జీవితాలను తెచ్చివ్వలేకున్నా, వారిపై ఆధారపడ్డవారికి పెద్ద ఎత్తున తగిన పరిహారం ఇవ్వాలని, పెద్ద ఎత్తున కావేరి ట్రావెల్స్ నుండి ఆ సొమ్ము రికవరి చేయాలనీ నయీమ్ ఖురేషి డిమాండ్ చేశారు.

## పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )అక్టోబరు 24: రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిం చాలని జనగామ పశుసంవర్ధక శాఖ ఏడిఏ రంజిత్ అన్నారు. మండలంలోని వెల్ది గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం జనగామ ఏడిఏ రంజిత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఎస్.కె. అసిఫా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాంలను అందజేసిన ఎన్ఆర్ఐలు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )అక్టోబరు 24: మండలంలోని కోమల్ల హైస్కూల్ విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు శ్రావణి, అరుణ్ రుద్ర, అయేషా సుల్తానా టీ–షర్టులతో పాటు ప్యాంటులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నర్సింహులు, సత్యప్రకాష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వేణుమాధవ్, స్వప్న, సురేష్, షహీన్ తబస్, సుస్మిత, ఆలం, రమ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పేదింటి వారి కళ నెరవేరుతుంది



మద్నూర్ / అక్టోబర్ 25 (అక్షరం న్యూస్ – కామారెడ్డి )

డోంగ్లీ మండలం మొఘ గ్రామంలో నూతన రెండు ఇండ్లను మంజూరు కావడం జరిగిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ తెలిపారు. శుక్రవారం రోజున లబ్దిదారుల యొక్క ఖాళీ స్థలంలో పంచాయతీ సెక్రటరీ నందు ఆధ్వర్యంలో మోగ్గు వేశారు. గ్రామానికి ఇద్దరికీ నూతన ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం తో ఇరు కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే కాంతారావు కు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి సమూచిత స్థానాలు కల్పిస్తూ వారికి ప్రభుత్వం ద్వారా అందె సంక్షేమ పథకాలు లబ్ది చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇండ్లను ఇవ్వకుండా సామాన్య ప్రజలకు మోసం చేశారాని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇందిరమ్మ హయాంలో , ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనకు నిదర్శనం అనీ తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని వర్గాల వారి యొక్క ఆశీర్వాదం తో గెలుపొందటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రటరీ నందు, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సంగ్రామ్ పటేల్, నాగనాథ్ పటేల్, బస్వంత్ పటేల్, సుధాకర్ గౌడ్, మాష్ణాజి, బస్వంత్, అంబటివార్ మారోతి, మోహిన్ సాధక్, చంద్రకాంత్, హమ్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని గ్రామాల్లో నూతన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎగేటి సదానందం.



కరీంనగర్/జమ్మికుంట/అక్టోబర్ 24/అక్షరం న్యూస్:

జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి సెంటర్లను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎగేటి సదానందం లు ప్రారంభించారు, మండలంలోని మడిపల్లి, నాగంపేట, వెంకటేశ్వర్ల పల్లె,బిజిగిరి షరీఫ్, గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన వడ్ల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన వడ్లను ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగిన చర్యలుతీసుకోవాలని తెలిపారు. అలాగే సన్న వడ్ల కొనుగోలు కూడా జరుగుతుందని, రైతులకు ప్రభుత్వం బోనస్ అందజేస్తుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అండగా ఉంటుందిఅని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఐలోని సాంబశివ రెడ్డి,,మాజీ ఎంపీపీ రాజమల్లు గౌడ్,.మాజీ ఉప సర్పంచ్ పోసిని సత్యనారాయణ, మాకమల్ల అశోక్,. ఏ పిఎం కొమురయ్య, శ్రీనివాస్, సి సి డి ,ఈ సుమలత, వివో ఏ ఐ .పరమేశ్వరి, సిఏ ప్రియాంక, సి ఎ స్వప్న, ప్రజా ప్రతినిధులు రైతులు మహిళా సంఘాల సభ్యులు, హమాలి సంఘం అధ్యక్షులు, గ్రామల రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు ప్రారంభం





కరీంనగర్/జమ్మికుంట/అక్టోబర్ 24/అక్షరం న్యూస్: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రోజున పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ కార్పొరేషన్ అధికారి టిఎస్ ఆగ్రోస్ ఎండి రాములు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ స్వప్న సదానందం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులను సూచించారు. మార్కెట్ కు పత్తిని తీసుకొచ్చే రైతులు పత్తిలో తేమ శాతం లేకుండా తీసుకొచ్చి సిసిఐ కొనుగోలు కేంద్రాలకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్ డి డి ఎం ఈ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంపీ షాబుద్దీన్, జమ్మికుంట తహశీల్దార్ నల్ల వెంకటరెడ్డి, ఎంపీడీవో పద్మావతి, సిసిఐ సెంటర్ ఇంచార్జ్ పేరం చంద్రశేఖర్, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేష్, ద్వితీయ శ్రేణి కార్యదర్శి, ఎన్ రాజు,మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి పలకవర్గ సభ్యులు, గడ్డం దీక్షిత్, వి.సునీల్, సదానందం , క్షాటన్ మిల్లర్స్ అధ్యక్షులు మల్లారెడ్డి, అడ్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మార్కెట్ సిబ్బంది రైతులు గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో యువతి మృతి



ఓదెల/పెద్దపల్లి అక్టోబర్ 24(అక్షరం న్యూస్)

పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల రూపు నారాయణపేట గ్రామానికి చెందిన గుర్రం అక్షిత వయసు 18 సంవత్సరాలు గుర్తుతెలియని విషపురుగు పాము కాటుకు గురై మృతి చెందింది ఎస్సై దీకొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం రూపు నారాయణపేట గ్రామానికి చెందిన గుర్రం అక్షిత వయసు 18 సంవత్సరాలు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత దీపావళి సెలవుల కోసం అని ఇంటికి వచ్చింది శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటిలో ఉండగా మంచంపై పడుకొని సెల్ ఫోన్ చూస్తుండగా ఏదో విషపు పాము ఎడమకాలు కు కొట్టిందని అనడంతో ఇంటి పక్కన ఉన్న శ్రీధర్ 108 కి ఫోన్ చేసి చికిత్స కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కరీంనగర్ ఆసుపత్రి వైద్యులు పరిశీలించి మృతి చెందిందని చెప్పారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

## ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్



కరీంనగర్ చిగురుమామిడి అక్టోబర్ 24(అక్షరం న్యూస్) చిగురుమామిడి మండల కేంద్రంలోనీ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కరీంనగర్ అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓపీ రిజిస్టర్, రికార్డులు, ల్యాబ్ రూమ్, ఫార్మసీ రూమ్, సిబ్బంది పని తీరును మండల వైద్యాధికారినీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని అన్నారు. మండల ఆరోగ్య కేంద్రం, మరియు ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఉదయం నుండి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు, ఆశ కార్యకర్తలు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని మండల వైద్య అధికారి రాజేష్‌కు సూచించారు. చిగురుమామిడి మండలంపై అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్ ప్రత్యేక దృష్టి పెడతామని, మధ్యాహ్నం 3 తర్వాత ఆకస్మికంగా మండలంలోని ఆరోగ్యఉపకేంద్రం కూడా తనిఖీ చేస్తానని వారు తెలిపారు.

## శ్రీలంకలో పెద్ది పాట షూటింగ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం పెద్ది కోసం శ్రీలంకకు బయల్దేరారు. 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. సినిమా షూటింగ్ కోసం హీరో రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చి బాబు సానా శ్రీలంకకు బయల్దేరారు. సమాచారం ప్రకారం, రేపటి నుండే అక్కడ పెద్ది షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ శ్రీలంక షెడ్యూల్‌లో, టీమ్ పెద్ది కొన్ని కీలకమైన సన్నివేశాలను, ఒక పాటను చిత్రీకరించనుంది. శ్రీలంకలోని అద్భుతమైన లొకేషన్లలో హీరో చరణ్, హీరోయిన్ జాన్వీ కాంబినేషన్లో ఈ పాటను షూట్ చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మ్యూజికల్ అప్‌డేట్ గురించి కూడా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. శ్రీలంకలో ఈ షూటింగ్ షెడ్యూల్ చురుకుగా పూర్తి చేసిన వెంటనే, ఈ సినిమా నుండి మొదటి సింగిల్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ మొదటి సింగిల్ పాటలో శ్రీలంకలో చిత్రీకరించిన అద్భుతమైన విజువల్స్‌ను జత చేయనున్నారు. దీంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## నవంబర్ 5న రాజాసాహెబ్ ఫస్ట్ సింగిల్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన రాజాసాబ్ ఫస్ట్ గ్లిమ్స్, ట్రైలర్ కు భారీ స్పందన వచ్చింది. రెబల్ స్టార్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని సంగీత దర్శకుడు తమన్ ఆ మధ్య హింట్ ఇచ్చాడు కానీ ఎటువంటి అప్డేట్ ఇవ్వకుండా జస్ట్ పోస్టర్ తో సరిపెట్టారు మేకర్స్. దాంతో ఫ్యాన్స్ కాస్త డిజప్పోయింట్ అయ్యారు. కనీసం ఫస్ట్ సింగిల్ రిలీజ్ ఎప్పుడు ఉంటుందని డేట్ కూడా చెప్పలేదని సోషల్ మీడియాలో కామెంట్స్ చేసారు. తాజాగా పీపుల్స్ మీడియా నిర్మించిన మరో సినిమా మోగ్లీ ఫస్ట్ సింగిల్ లాంచ్ లో నిర్మాత విశ్వప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడూతూ' రాజసాబ్ ఫస్ట్ సింగిల్ ను నవంబరు 5న రిలీజ్ చేస్తాము. అలాగే జనవరి 9న వరల్డ్ వైడ్ గా సినిమా రిలీజ్ అవుతుంది. రిలీజ్ కు ముందు రాజాసాబ్ సెకండ్ ట్రైలర్ ను రిలీజ్ చేస్తాం' అని అన్నారు. రెబెల్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఫస్ట్ సింగిల్ అప్డేట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.

## స్మృతి మంధానా సెంచరీతో రికార్డుల మోత

భారత మహిళల క్రికెట్ జట్టు ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌లో మూడు ఓటముల తరువాత విజయం సాధించింది. డి.వై పాటిల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ స్టేజీ మ్యాచులో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ స్మృతి మంధానా సెంచరీతో చెలరేగి పలు రికార్డులు తన పేరిట లిఖించుకుంది. మంధానా 95 బంతుల్లో 109 పరుగులు చేసి 10 ఫోర్లు, 4 సిక్సర్లు బాదింది. ఈ ఇన్నింగ్స్‌తో స్మృతి మహిళల వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. ఆమెతో పాటు మరో ఓపెనర్ ప్రతీకా రావల్ సెంచరీ ఇన్నింగ్స్‌లతో టీమ్ ఇండియా సెమీ స్ వైపు అడుగులు వేసింది. స్మృతి మంధానా ఈ అద్భుతమైన సెంచరీతో పలు రికార్డులు సాధించింది. తన వన్డే కెరీర్‌లో స్మృతి మంధానా 14వ సెంచరీ సాధించింది. దీంతో మంధానా న్యూజిలాండ్ సూజీ బేట్స్ (13 సెంచరీలు)ను అధిగమించి ఆస్ట్రేలియా బ్యాటర్ మెగ్ లానింగ్ (15 సెంచరీలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంది.అంతర్జాతీయ క్రికెట్ ఫార్మాట్‌లలో స్మృతి మంధానాకు (టెస్ట్, వన్డే, టీ20) మొత్తం 17వ సెంచరీ ఇది. ఈ ఘనతతో ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీల పరంగా మెగ్ లానింగ్‌తో సమానంగా నిలిచింది .ప్రపంచ కప్ 2025లో ఇది మొదటి సెంచరీ, కాగా మొత్తం ప్రపంచ కప్‌లలో స్మృతి మంధానాకు ఇది మూడో సెంచరీ. ఈ సెంచరీతో వరల్డ్ కప్ శతకాలలో ఆమె భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో సమానంగా నిలిచింది.మంధానా తన ఓపెనింగ్ భాగస్వామి ప్రతీకా రావల్‌తో కలిసి 212 పరుగులు జోడించి మహిళల ప్రపంచ కప్‌లో భారత్ తరపున అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం సైతం నెలకొల్పింది.ఈ ఏడాది స్మృతి మంధానా ఇప్పటివరకు 29 సిక్సర్లు కొట్టింది. ఆమె 2017లో 28 సిక్సర్లు కొట్టిన దక్షిణాఫ్రికాకు చెందిన లిజెల్ లీ రికార్డును బద్దలు కొట్టింది.

# శ్రీ వర్షిత ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే....

- మృతురాల కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి
- పాఠశాల ప్రిన్సిపల్ సస్పెండ్ చేయాలి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- మృతురాలి కుటుంబానికి కౌశిక్ రెడ్డి 50వేల ఆర్థిక సాయం



కరీంనగర్/హుజురాబాద్/అక్టోబర్ 24/అక్షరం న్యూస్: గురుకులం రెసిడెన్షియల్ పాఠశాల వంగరలో చదువుతున్న శ్రీ వర్షిత ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం హుజురాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రి లో ఆత్మహత్యకు పాల్పడిన చిన్నారికి న్యాయం చేయాలంటూ వర్షిత మృతదేహంతో అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో భాగంగా ఆయన మాట్లాడారు. హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తిరుపతి కూతురు శ్రీ వర్షిత ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక మరణించింది అని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ తన ఆధీనంలో పెట్టుకొని పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి వారి ఆత్మహత్యలకు కారణం అవుతున్నారని ఆరోపించారు. కెసిఆర్ హయాంలో విద్యార్థులు అన్ని రకాల వసతులతో పాటు రక్షణతో కూడిన విద్యను అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలతో మొదలుకొని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఎలుకలు, కుక్కలు కోతులు కరిచిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనతోనే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శ్రీ వర్షిత ఆత్మహత్యకు కారణమైన ప్రిన్సిపాల్ ను విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అసమర్థ పాలనకు విద్యార్థుల జీవితాలు బలవుతున్నాయని అన్నారు. అనంతరం మృతురాలు వర్షిత కుటుంబానికి 50వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట మృతురాలి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సెమీస్ చేరుకున్న టీమిండియా..



సొంతగడ్డపై భారత మహిళల జట్టు ఎట్టకేలకు సెమీస్‌కు చేరుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయినప్పటికీ న్యూజిలాండ్‌పై అక్టోబర్ 23న కీలక విజయాన్ని అందుకొని సెమీస్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. ఇండియాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. భారత్ విషయానికి వస్తే చివరి మ్యాచ్ ఆదివారం, అక్టోబర్ 26 బంగ్లాదేశ్‌తో తలపడాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో మొదటి రెండు మ్యాచ్‌ల్లో విజయాన్ని సాధించిన ఇండియా.. ఆ తరువాత గాడితప్పింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. అయినప్పటికి కివీస్‌పై విజయంతో సెమీస్‌కు చేరుకుంది. ఇక ఇప్పుడు అందరి దృష్టి సెమీస్‌లో భారత ప్రత్యర్థి ఎవరు అన్నదానిపైనే పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 11 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. 10 పాయింట్లతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉండగా, 9 పాయింట్లతో ఇంగ్లాండ్ మూడో స్థానంలో నిలిచింది. ఇక భారత్ 6 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుంది. అన్ని జట్లు కూడా లీగ్ స్టేజీలో తమ చివరి మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. ఈ క్రమంలో పాయింట్ల పట్టికలో టాప్-4 స్థానాల్లో మార్పులు చోటు చేసుకోవచ్చు. అయితే.. భారత్ తమ చివరి మ్యాచ్‌లో విజయం సాధించినా కూడా 8 పాయింట్లే ఉంటాయి. ఇప్పుడున్న పాయింట్ల ప్రకారం చూసినా కూడా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ జట్లను దాటలేదు. కాబట్టి నాలుగో స్థానంలోనే భారత్ సెమీస్‌లో అడుగుపెట్టనుంది. ప్రపంచకప్ నిబంధనల ప్రకారం సెమీస్‌లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడాల్సి ఉంది. ప్రస్తుతం ఆసీస్ అగ్రస్థానంలో ఉంది. తమ చివరి మ్యాచ్‌లో ఆసీస్ జట్టు దక్షిణాఫ్రికాతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ గెలిస్తే.. అగ్రస్థానంతోనే సెమీస్‌లో అడుగుపెడుతుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా గెలిస్తే.. అప్పుడు సఫారీలు 12 పాయింట్లతో అగ్రస్థానంతో సెమీస్‌కు చేరుకుంటుంది. అంటే ఈ లెక్కన.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో భారత్ సెమీస్‌లో తలపడనుంది. అక్టోబర్ 30న భారత్ సెమీస్ మ్యాచ్ ఆడనుంది.

## రాజమౌళి-మహేశ్ బాబుల మూవీ

### మ్యూజిక్ సెషన్ మొదలయ్యిందన్న కాలభైరవ

ఎస్ఎస్ఎంబి 29 ప్రస్తుతం భారతీయ సినీ ఇండస్ట్రీలో క్రేజీ ప్రాజెక్ట్. మహేశ్‌బాబు కథానాయకుడిగా అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు కాల భైరవ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆయన స్వరాలు సమకూర్చిన 'మోగ్లీ' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మహేశ్-రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి సంగీత కార్యక్రమాలు మొదలైనట్లు తెలిపారు. నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే, కచ్చితంగా చెబుతారు. ముఖ్యంగా రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తా. ఎస్ఎస్ఎంబి 29కు సంబంధించి కూడా మ్యూజిక్ పనులు ఇటీవల మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా అని అన్నారు. దీంతో మహేశ్ అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించి అసలైన అప్‌డేట్ నవంబరులో రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌ను వెల్లడించడంతో పాటు, ఓ వీడియోను కూడా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులను కూడా పూర్తి చేశారట. హైదరాబాద్ వేదికగా ప్రెస్‌మీట్ లేదా ఈవెంట్‌ను నిర్వహించి వీడియోను విడుదల చేయనున్నారు. అప్పుడే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అనువైన వేదిక కోసం చిత్ర బృందం శోధన మొదలు పెట్టింది. నెలాఖరులోగా దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. వారణాశి నేపథ్యంగా సాగే కథతో రాజమౌళి దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609